
www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 30 జూన్ 2025
5
ఏలూరు



పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

పోలవరం స్పిల్ వే నుంచి 28,879 క్యూసెక్కుల నీరు విడుదల


స్పిల్ వే నుంచి విడుదలవుతున్న నీరు

పోలవరం : పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే నుంచి రూ. 28,879 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు జలవనరులశాఖ అధికారులు ఆదివారం తెలిపారు. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు ఉప నదులు, కొండవాగుల జలాలు గోదావరిలో కలిసి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతూ వస్తుంది. అదనంగా వస్తున్న నీటిని ప్రాజెక్టు స్పిల్ వే 48 గేట్లు, స్పిల్‌వేలో ఆరు స్లూయిజ్ గేట్ల నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన 26.090 మీటర్లు, దిగువన 17.290 మీటర్లు ఎగువ కాపర్ డ్యామ్‌కు ఎగువన 26.120 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్‌కు దిగువన 14,180 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌ల మధ్య 15,320 మీటర్ల నీటిమట్టం నమోదైంది.

మిగులు భూములు మింగేశారా..!

పోలవరం నిర్వాసితులకు అప్పట్లోనే అదనంగా భూముల సేకరణ

జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో వెయ్యి ఎకరాల వరకూ మిగులు భూమి ఉన్నట్లు లెక్క

మళ్లీ కూనవరం, విఆర్‌పురం నిర్వాసితులకు భూసేకరణ అంటూ అధికారుల హడావుడీ

వివాదంలో ఉన్న ఎల్‌టిఆర్ భూముల సేకరణకు కుట్ర

ఐటిడిఎ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

మిగులు భూములన్నీ ప్రజాప్రతినిధుల చేతుల్లోనే ఉన్నాయా?


ఐటిడిఎ కార్యాలయం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం నిర్వాసితులకు భూసేకరణ పేరుతో ప్రజాప్రతినిధులు, అధికారులు మళ్లీ దోపిడీకి ప్రణాళికలు రచించినట్లు తెలుస్తోంది. తూర్పుగోదావరి జిల్లా కూనవరం, విఆర్‌పురం మండలాల్లో నిర్వాసితులకు భూమికి భూమి, ఇళ్ల స్థలాల కోసం భూసేకరణ అంటూ బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో అధికారులు హడావుడీ చేస్తున్నారు. 2014-19 మధ్య టిడిపి పాలనలో పోలవరం కోసం చేసిన భూసేకరణలో దాదాపు వెయ్యి ఎకరాల వరకూ అదనంగా ఉందని, అవసరాలకు ఆ భూమి వాడుకుంటామని అప్పట్లో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులే అక్కడి ప్రజలకు చెప్పారు. ఎకరాకు రూ. 10.50 లక్షలు వెచ్చించి అప్పట్లో భూములను కొనుగోలు చేసిన పరిస్థితి ఉంది. అప్పట్లో సేకరించిన మిగులు భూములు పెద్దఎత్తున ఉన్నప్పటికీ ఇప్పుడు మళ్లీ భూసేకరణ చేసి భారీగా దోపిడీకి పాల్పడేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కుట్రలు చేస్తున్నట్లు సమాచారం. 2014-19 టిడిపి పాలనలోనే పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం జీలుగుమిల్లి, బుట్టాయగూడెంలో పెద్దఎత్తున భూసేకరణ జరిగింది. కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాలకు చెందిన నిర్వాసితులతోపాటు, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన ఏజెన్సీ గ్రామాల నిర్వాసితులకు ఇక్కడ భూమికి భూమి, ఇళ్ల స్థలాల కోసం భూ సేకరణ జరిగింది. ఇక్కడకు తరలించే నిర్వాసితులకు పంపిణీ చేయగా ఇంకా జీలుగుమిల్లి మండలంలో 320 ఎకరాలు, బుట్టాయగూడెం మండలంలో 700 ఎకరాలకు పైగా మిగులు మిగులు భూమి ఉన్నట్లు అప్పట్లో అధికారులు చెప్పారు. ఇప్పుడు కూనవరం, విఆర్‌పురం నుంచి తరలించాలనుకుంటున్న నిర్వాసితులకు ఆ మిగులు భూములు ఇవ్వొచ్చు. అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం దీనికి విరుద్ధంగా మళ్లీ 500లకు పైగా ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం, దొరమామిడి గ్రామాల్లోనూ, జీలుగుమిల్లి మండలంలోని పూచికపాడు, జగన్నాథపురం, అంకన్నగూడెం, జీలుగుమిల్లి, వంకావారిగూడెం, దర్భగూడెం, బర్రింకలపాడు గ్రామాల్లో భూములు సేకరించే పనిలో అధికారులు పడ్డారు. పోలవరం నిర్వాసితుల పేరుతో చేస్తున్న భూ సేకరణలో పెద్ద ఎత్తున గూడుపుఠాణి సాగుతున్నట్లు తెలుస్తోంది.

వివాదాస్పద ఎల్‌టిఆర్ భూముల కొనుగోలుకు కుట్ర

ఏజెన్సీలో ఎల్‌టిఆర్ (ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్) భూములకు సంబంధించి గిరిజనులు, భూస్వాములకు మధ్య దశాబ్దాలుగా ఘర్షణ జరుగుతోంది. గిరిజనేతర భూస్వాములకు అధికారులు అండగా నిలుస్తూ గిరిజనులకు అన్యాయం చేస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో భూములకు సంబంధించి గిరిజనులు, గిరిజనేతరుల మధ్య వివాదాలు కొనసాగుతునే ఉన్నాయి. గిరిజనేతర భూస్వాములకు మేలు చేయాలన్న ప్రణాళికతో మరోసారి భూసేకరణకు దిగినట్లు తెలుస్తోంది. వివాదాస్పద ఎల్‌టిఆర్ భూములు కొనుగోలు చేసి ఇతర గ్రామాల నుంచి తరలిస్తున్న నిర్వాసితులకు ఇస్తే.. ఇక్కడి గిరిజనులకు, వచ్చిన వారికి గొడవలు జరిగే పరిస్థితి ఏర్పడనుంది. ఇదంతా ఉద్దేశపూర్వకంగానే అధికారులు చేస్తున్నట్లు ఏజెన్సీలో చర్చ జరుగుతోంది. ఐటిడిఎ అధికారులు వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

మిగులు భూములు అనుభవిస్తున్నదెవరు?

పోలవరం నిర్వాసితుల కోసం సేకరించిన మిగులు భూములు ప్రస్తుతం ఎవరి చేతుల్లో ఉన్నాయో అధికారులు చెప్పడం లేదు. ఆ భూములు నియోజకవర్గ ప్రజా ప్రతినిధులుగా ఉన్న నేతలు వందల ఎకరాల భూములను లీజులకు ఇచ్చుకుని అక్రమంగా అనుభవిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలు ఆ భూములను లీజులకు ఇచ్చుకుని సొమ్ము మింగేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ కారణం చేతే మిగులు భూముల అంశాన్ని మరుగునపెట్టి మళ్లీ భూసేకరణ చేసేందుకు ప్రణాళికలు రచించినట్లు సమాచారం. ఇదంతా ఏజెన్సీలో పనిచేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు చేస్తున్న కుట్రలో భాగంగా సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. జిల్లా కలెక్టర్, జెసి జోక్యం చేసుకుని మిగులు భూముల సంగతి తేల్చాలని ఏజెన్సీ ప్రజలు కోరుతున్నారు.

మిగులు భూములను బయటకు తీయాలి

తెల్లం రామకృష్ణ, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు



గతంలో భూములు సేకరించినప్పుడు అదనంగా సేకరించినట్లు అప్పట్లో ఐటిడిఎ అధికారులే ప్రకటించారు. మిగులు భూములను ప్రభుత్వం వెంటనే బయటకు తీయాలి. ఆ భూములను ప్రజాప్రతినిధులు లీజులకు ఇచ్చి రూ. లక్షలు తీసుకుంటున్నారు. వివాదాస్పద ఎల్‌టిఆర్ భూములను కొనుగోలు చేయకూడదు. మిగులు భూముల సంగతి తేల్చకుండా అధికారులు ముందుకు సాగితే ఏజెన్సీ ప్రజల నుంచి ప్రతిఘటన తప్పదు.


చించినాడ సమరశీల పోరాట చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, నేతలు

చించినాడ పోరాట పటిమ ఆదర్శం

అమరవీరుల 75వ స్మారక సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - భీమవరం, యలమంచిలి

చించినాడ పోరాట పటిమ ఆదర్శనీయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం చించినాడ గ్రామంలో అమరువీరుల 75వ స్మారక సభ ఆదివారం సాయంత్రం జరిగింది. సిపిఎం చించినాడ పోరాట యోధుడు కేతా సూర్యారావు సిపిఎం జెండాను ఆవిష్కరించారు. అమరవీరుల స్తూపానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి బలరాం, రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, కేతా సూర్యారావు, తెన్నేటి సంపతరావు పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు అధ్యక్షత వహించిన సభలో చించినాడ పోరాట యోధుడు కేతా సూర్యారావు రచించిన చించినాడ సమరశీల పోరాట చరిత్ర పుస్తకాన్ని శ్రీనివాసరావు ఆవిష్కరించి తొలి కాపీని సూర్యారావుకు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా విచ్చేసిన వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ చించినాడ పోరాట పటిమ ఎంతో ఆదర్శమన్నారు. భూస్వాములు, పెత్తందారులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఎంతో మంది అమరులయ్యారని, వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. మార్కెట్లో సరుకులు కొన్నట్లు ఓటర్లను కొంటున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మారాలని హితవు పలికారు. 2014లో ఓట్లు, సీట్లతో కేంద్రాన్ని వణికించారని, ప్రస్తుతం మెజార్టీ ఉన్నా మోడీని ఏమీ అనలేకపోతున్నారని విమర్శించారు. మూడు సార్లు రాష్ట్ర పర్యటనకు వచ్చిన మోడీ వచ్చి వెళ్లారే తప్ప ఒరిగిందేమీ లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తవుతోందని, వాగ్దానాలు ఏమీ అమలు చేయలేదని చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీల గురించి ఎవరూ మాట్లాడడం లేదని తెలిపారు. రూ.11 వేల 444 కోట్లు విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నారని జిఎస్‌టి, బకాయిల పేరుతో తీసుకోగా కేవలం రూ.1,534 కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. ఈ నిధుల వినియోగానికి సవాలక్ష నిబంధనలు పెట్టారని తెలిపారు. ఐదు వేల మంది కార్మికులను ఉద్యోగం నుంచి తొలగించారని, మరో 3 డిపార్టుమెంట్లకు సంబంధించిన పనులు ప్రయివేటుకు అప్పగిస్తున్నారని తెలిపారు. ఇది నిజమో కాదో టిడిపి చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రం తీవ్ర సమస్యల్లో ఉందని అప్పులు తేకపోతే ప్రభుత్వాలు నడిచే పరిస్థితిలో లేవని తెలిపారు. అయితే ప్రతి కుటుంబమూ లక్షా 20 వేల అప్పుల్లో కూరుకుపోయిందని, దీనిపై ఆలోచన చేయాలని తెలిపారు. 50 లక్షల మంది కార్మికులకు 13 ఏళ్ల నుంచి జీతాలు పెంచలేదని, కనీసం దీనికి జిఒ కూడా ఇవ్వలేదని తెలిపారు. పేదల్లలో 2 లక్షల ఎకరాల భూమిని ఎపి ఐఎస్‌ఆర్ ద్వారా సేకరించారని, ఎన్ని పరిశ్రమలు పెట్టారో, ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో పేదరికం నిర్మూలన కావాలంటే సుస్థిర అభివృద్ధి జరగాలన్నారు.

అనంతరం జరిగిన సభలో సీతారాం మాట్లాడుతూ చించినాడలో అమరవీరుల త్యాగాల ఫలితంగానే సుదీర్ఘకాలం పాటు ఎర్రజెండా పాలన సాగిందన్నారు. అనేక పోరాటాలకు సిపిఎం సీనియర్ నేత కేతా సూర్యారావు ప్రత్యక్షంగా నాయకత్వం వహించగా ఆయనకు మాజీ ఎంఎల్ఎ ఆర్ఎస్ గైడ్‌గా ఉంటూ నడిపించే వారిని తెఇపారు. వీరికి కమ్యూనిస్టుడు పుచ్చలపల్లి సుందరయ్య అనేక విషయాల్లో అండదండలు అందించి పోరాటాన్ని ముందుకు నడిపించే వారిని గుర్తు చేశారు. అటువంటి పోరాటాల్లో ఇప్పటితరం కొనసాగిస్తేనే మరలా ప్రజలకు దగ్గరయ్యే అవకాశం ఉందని తెలిపారు. సిపిఎం సీనియర్ నేత కేతా సూర్యారావు మాట్లాడుతూ 1951 - 53లో ఆనాటి పోలీసు గూండాలు చించినాడ గ్రామం కలగంపూడి పుంతలో ముగ్గురు కమ్యూనిస్టులను చింత చెట్టుకు కట్టి తుపాకీ గుళ్లతో కాల్చి చంపారని, ఆనాటి ఆ ఘటన జరిగే సమయానికి తనకు 16 సంవత్సరాలని, ఆ సంఘటనే తనను కమ్యూనిస్టుగా మార్చిందని, అనంతర కాలంలో అమరవీరుల స్ఫూర్తితో అనేక పోరాటాలకు నాయకత్వం వహించామని తెలిపారు. సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ చించినాడ పోరాట చరిత్ర పోరాడే వారికి స్ఫూర్తినిచ్చిందని, భూస్వాములకు వెన్నులో వణుకు పుట్టించిందని తెలిపారు. పార్టీకి అంకితమై పోరాటమే ఊపిరిగా జీవించే వారు ఎవరైనా ఉన్నారంటే అది ఒక కమ్యూనిస్టులు మాత్రమేనని తెలిపారు. వర్గ పోరాటంలో ఎలా చేయాలో సీనియర్ నేత కేతా సూర్యారావు నుంచి ఎంతో నేర్చుకున్నామని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ అమరవీరుల త్యాగాల ఫలితంగానే చించినాడలో 68 సంవత్సరాల పాటు చించినాడ పంచాయతీ 62 సంవత్సరాల పాటు సొసైటీని ఏక చక్రాధిపత్యంగా కమ్యూనిస్టుల పాలన సాగిందని, సిపిఎం అధికారంలో లేకపోయినా కమ్యూనిస్టు పాలనలో చించినాడ గ్రామం ఎంతో ఆదర్శవంతమని తెలిపారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడుతూ చించినాడ పోరాటంలో మహిళల పాత్ర చాలా ఉందన్నారు. ఆనాటి స్ఫూర్తితో చించినాడలో మళ్లీ ఎర్రజెండా రెపరెపలాడుతోందన్నారు. సభా ప్రారంభానికి ముందు ఆనాటి పోరాటంలో పాల్గొన్న నాయకులు అల్లూరి రామకృష్ణంరాజు, పెచ్చెట్టి సత్యనారాయణమ్మ, జిల్లెల్ల ఆదిలక్ష్మి, తెన్నేటి సంపుతారావు, చెల్లిబోయిన నరసింహమూర్తి దంపతులు అరటకట్ల నారాయణమ్మ, మునకాల గాంధారి తదితరులను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు దిగుపాటి రాజగోపాల్, సిపిఎం జిల్లా నాయకులు కౌవురు పెద్దిరాజు, చింతకాయల బాబూరావు, బి.వాసుదేవరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, కేతా గోపాలన్ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖ నిబంధనలు పాటించేనా?

సచివాలయ ఉద్యోగులైన మహిళా పోలీసుల బదిలీలపై చర్చ

వికలాంగులు, స్పౌజ్, ఆరోగ్య సమస్యల వారికి మొదటి ప్రాధాన్యత ఇచ్చేనా

సీనియార్టీ, ర్యాంకులను పరిగణలోకి తీసుకుంటారా..

ఇతర శాఖల్లో అడ్డగోలుగా బదిలీల వ్యవహారం

పారదర్శకంగా బదిలీలు చేయాలంటూ పోలీస్ అధికారులకు మహిళా పోలీసుల వినతి


పోలీస్ ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇస్తున్న మహిళా పోలీసులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సచివాలయ ఉద్యోగులైన మహిళా పోలీసుల బదిలీల్లో పోలీస్ శాఖ నిబంధనలు పాటిస్తుందా.. ఇతర శాఖల మాదిరిగా సిఫార్సులకే ప్రాధాన్యత ఇస్తుందా అన్న చర్చ ఉద్యోగుల్లో నడుస్తోంది. పలు జిల్లాల్లో నిబంధనల ప్రకారం మహిళా పోలీసుల బదిలీలు జరిగాయని, వికలాంగులకు, స్పౌజ్, ఆరోగ్య ఇబ్బందులు ఉన్న కేటగిరికి మొదటి ప్రాధాన్యత ఇచ్చాకే తర్వాత సీనియార్టీ, ర్యాంకుల వారీగా బదిలీల ప్రక్రియ చేపట్టినట్లు తెలుస్తోంది. అదే తరహాలో జిల్లా పోలీస్ అధికారులు బదిలీలు నిర్వహిస్తారా.. లేక నిబంధనలకు విరుద్ధంగా నడుస్తారా అన్న చర్చ నెలకొంది. సచివాలయ ఉద్యోగుల బదిలీల నేపథ్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని దాదాపు 1,125 మంది మహిళా పోలీసులు ఆదివారం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయానికి తరలివచ్చారు. ఆప్షన్ల ఫాంలను అధికారులకు అందించారు. ప్రతి మహిళా పోలీసూ ఐదు సచివాలయాలను ఆప్షనల్‌గా ఎంచుకున్నారు. ఉద్యోగులు ఇచ్చిన ఆప్షనల్ ఆధారంగా బదిలీలు చేస్తారా.. లేక ఎంఎల్‌ఎల సిఫార్సుల లేఖలకు ప్రాధాన్యత ఇస్తారో చూడాల్సి ఉంది. సచివాలయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం నిబంధనలు పక్కగా పేర్కొంది. వికలాంగులు, స్పౌజ్, ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని జిఒలో స్పష్టంగా తెలిపింది. ఇతర శాఖల అధికారులు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరించడంతో ఉద్యోగుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. దీంతో సచివాలయ ఉద్యోగుల బదిలీల వ్యవహారం గందరగోళంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో బదిలీలను బహిష్కరించారు. జిల్లాలోని సచివాలయ ఉద్యోగుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

పారదర్శకంగా బదిలీలు చేయాలంటూ మహిళా పోలీసుల వినతి

పారదర్శకంగా బదిలీలు చేయాలంటూ ఆదివారం పోలీస్ ఉన్నతాధికారులకు జిల్లా పోలీస్ కార్యాలయంలో మహిళా పోలీసులు వినతిపత్రం అందజేశారు. వినతిలో సీనియార్టీ జాబితాతోపాటు స్టేట్, జిల్లా ర్యాంకు, రోస్టర్ పాయింట్స్ ఆధారంగా ఉమ్మడి జిల్లా ప్రాతిదికన బదిలీలు నిర్వహించాలని కోరారు. భవిష్యత్తులో ఇబ్బంది లేకుండా, ఉద్యోగోన్నతిలో ఇబ్బందులు తలెత్తకుండా సీనియార్టీ జాబితా ప్రకారం ఫిజికల్‌గా కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీలు చేయాలని విన్నవించారు. మహిళా పోలీసుల విన్నపాలను, నిబంధనలు పాటిస్తూ పోలీస్‌శాఖ బదిలీలు నిర్వహిస్తుందా.. లేక అందుకు విరుద్ధంగా కొనసాగుతుందో చూడాల్సి ఉంది. బదిలీల అంశంపై ఇప్పటికే సచివాలయాల ఉద్యోగులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. జాబితాలు విడుదలైన తర్వాత మరింత ఆందోళనలు జరిగే పరిస్థితి కనిపిస్తోంది.

విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యాహక్కు చట్టం జిల్లాలో అమలుకు ఉన్నతాధికారులు తగిన విధంగా కృషి చేయాలని, చట్టాన్ని జిల్లాలోని అన్ని ప్రయివేట్ పాఠశాలల్లో అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాహక్కు చట్టం జిల్లాలో అమలుకు దూరంగా ఉంటుందని తెలిపారు. ఈ చట్టంలోని 12-1సి సెక్షన్ ప్రకారం ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లను పేద కుటుంబాలకు చెందిన బాలలకు, ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి, అనాథ బాలలకు తదితర కేటగిరీల వారికి కేటాయించాల్సి ఉందని తెలిపారు. ఈ విధంగా చేర్చుకున్న బాలలకు పట్టణ ప్రాంతాల్లో రూ.ఎనిమిది వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.6,500 చొప్పున ప్రభుత్వమే రుసుము చెల్లించేలా ఈ చట్టం నిర్ధారించిందని తెలిపారు. 2025 -2026 విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యా హక్కు చట్టం ప్రకారం ఒకటో తరగతిలో ఉచిత సీట్లను భర్తీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా జిల్లాలో ఇప్పటివరకు పెద్దగా అమలైన దాఖలాలు లేవని పేర్కొన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొన్ని పాఠశాలల్లో బాలలను చేర్పించుకున్నప్పటికీ వారిపై వివక్ష చూపుతున్నారని తెలిపారు. తల్లిదండ్రుల నుంచి అనధికారికంగా రుసుములు వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిపై జిల్లా విద్యా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి ఆ విధంగా ప్రవర్తించే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యా హక్కు చట్టాన్ని జిల్లాలో విధిగా ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అమలయేలా చూడాలని పేర్కొన్నారు.

నేడు యథావిధిగా పిజిఆర్‌ఎస్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత వేగవంతంగా, ప్రజల దృష్టికి మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్‌ఎస్) సేవలను మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిల్లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో సోమవారం యథావిధిగా పిజిఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. డివిజనల్ కార్యాలయాల్లో, లేదా మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం అందించిన అధికారిక వెబ్‌సైట్ https://meekosam.ap.gov.in ద్వారా ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

దళితుల భూములను అప్పగించి లీజు చెల్లించాలి

లేకుంటే పెద్దఎత్తున ఆందోళన

ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు

కొనసాగిన భూ స్వాధీనోద్యమం


భూ స్వాధీన ఉద్యమంలో నేతలు

ప్రజాశక్తి - మండవల్లి

దళితుల భూములను అప్పగించి లీజు చెల్లించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులు స్పష్టం చేశారు. మా భూములు మాకే కావాలంటూ ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ భూములను సిపిఎం ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకుని నిర్వహిస్తున్న భూస్వాధీన ఉద్యమం ఆదివారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు కె.జగదీష్ మాట్లాడుతూ లీజు ఇస్తామని తమ భూములను ఆక్రమించుకుని సాగు చేసుకుంటూ మాడపల్లి కృష్ణప్రసాద్ దళితులపై దౌర్జన్యానికి దిగుతున్నారన్నారు. పెత్తందారి మాడపాటి కృష్ణప్రసాద్ చెరువును ఖాళీ చేయాలని, మా భూములకు మాకు అప్పగించాలని కోరినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సాగు చేసుకుంటూ లీజులు చెల్లించకుండా సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికే సిపిఎం ఆధ్వర్యంలో చెరువును స్వాధీనం చేసుకున్నామని, చెరువును ఖాళీ చేసి వెళ్లకపోతే పంటను సైతం పట్టుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికైనా కృష్ణప్రసాద్ చెరువు ఖాళీ చేసి భూమి అప్పగించాలని, లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులు, దళితులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విలీనం కష్టాలు


విలీనమైన వణుదుర్రు యుపి స్కూల్

ప్రజాశక్తి - ముదినేపల్లి

నూతన బడుల వ్యవస్థలో పాఠశాలల విలీనంతో విద్యార్థులు అష్ట కష్టాలు పడుతున్నారు. మండలంలో 11 యుపి పాఠశాలలకు రెండు హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేసి తొమ్మిది యుపి పాఠశాలలను దూరంలో ఉన్న హైస్కూళ్లల్లో విలీనం చేశారు. దీంతో ఆ పాఠశాలల్లో విద్యార్థులు చాలా దూరంలో ఉన్న హై స్కూళ్లకు వెళ్లి చదువుకోవాలంటే చాలా కష్టాలు పడాల్సి వస్తుంది. మండలంలోని యుపి పాఠశాలలన్నీ బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా మారి 6, 7, 8 తరగతులు రద్దు కావడంతో ఆ పాఠశాలల విద్యార్థులు 5, 7, 9 కిలోమీటర్ల దూరంలో ఉన్న హైస్కూల్స్‌కు వెళ్లి చదువుకోవాలంటే చాలా అవస్థలు పడాల్సి వస్తుంది. మండలంలో చేవూరు, కాకరవాడ, కోడూరు, దాకరం, చినకామనపూడి, కొరగుంటపాలెం, వణుదుర్రు, దేవపూడి, వాడవల్లి యుపి పాఠశాలలు డీ గ్రేడ్ రావడంతో ఆయా పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదు తరగతులు మాత్రమే ఉన్నాయి. ఇప్పటివరకు ఆ పాఠశాలల్లో 6, 7, 8 తరగతులు చదివిన విద్యార్థులు దూరంలో ఉన్న ప్రభుత్వ హైస్కూళ్లు, ప్రయివేట్ పాఠశాలల్లో పై తరగతుల్లో చేరేందుకు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. పై తొమ్మిది యుపి పాఠశాలలకు చెందిన 179 మంది విద్యార్థులు దూర ప్రాంతాల్లో ఉన్న హై స్కూళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా కోడూరు, కొరగుంటపాలెం, దేవపూడి, వణుదుర్రు పాఠశాలలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పై నాలుగు పాఠశాలల విద్యార్థులు 6, 8, 9 కిలోమీటర్ల దూరంలో ఉన్న హై స్కూళ్లకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం అడ్డగోలు నిబంధనల పేరుతో పాఠశాలలను విలీనం చేయడంతో పేద విద్యార్థులకు దూరాభారం పెరిగి కష్టాలు మొదలయ్యాయి. ఇలా మండలంలోని అన్ని యుపి స్కూళ్లను హైస్కూల్లో విలీనం చేయడంతో పేద విద్యార్థులు దూరభారంతో కష్టాలు పడుతున్నారు.

పోల్‌రాజు కెనాల్‌కు సాగునీరు విడుదల


కాలువలో ప్రవహిస్తున్న నీరు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని ప్రధాన పంట కాలువల్లో ఒకటైన పోల్‌రాజు కెనాల్‌కు అధికారులు సాగునీరు విడుదల చేశారు. శనివారం సాయంత్రం గుడ్లవల్లేరు లాకులు నుంచి నీటిని వదిలారు. ప్రస్తుతం నీరు ముదినేపల్లి మండలంలోకి ప్రవేశించింది. ప్రస్తుతం రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఒకపక్క నారుమడులు పోస్తుండగా, మరో పక్క పొలాల్లో విత్తనాలను రైతులు నేరుగా వెదజల్లుతున్నారు. ఈ తరుణంలో సాగునీరు విడుదల చేయడంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీ బిజీగా ఉన్నారు. పది రోజుల క్రితం మండలంలోని సీబీ కెనాల్‌కు నీరు విడుదల చేయగా, వారం క్రితం బిఎండి ఛానల్‌కు నీటిని గుడ్లవల్లేరు లాకులు నుంచి విడుదల చేశారు. దీంతో ఈ మూడు కాలువల ఆయకట్టు భూముల్లో వ్యవసాయ పనులు జోరు అందుకున్నాయి. మండల వ్యాప్తంగా 14 వేల పైగా ఎకరాల్లో రైతులు సార్వా వరి సాగు చేస్తున్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్


మాట్లాడుతున్న సూర్యకిరణ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో డివైఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా కమిటీ సభ్యులు కె.అచ్చిబాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయాలని కోరారు. ప్రతిఏటా జాబ్ కేలండర్ విడుదల చేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకొచ్చి ఏడాది పూర్తి చేసుకున్నారని, జాబ్ క్యాలెం డర్ విడుదల కోసం నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఎపిపిఎస్‌సి నోటిఫికేషన్ల కోసం పది లక్షల మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారన్నారు. జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల లెక్చరర్ ఖాళీ పోస్టులు, యూనివర్సిటీల్లో ప్రొఫెసర్ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అటవీ శాఖలోని 800 బీట్ ఆఫీసర్, రేంజ్ ఆఫీసర్ పోస్టులకు ఆర్థిక శాఖ అనుమతినిచ్చినా ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. విద్యుత్ శాఖలో 15 వేలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. గ్రంథాలయ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఖాళీగా ఉన్న మూడు వేల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎపిపిఎస్‌సి ద్వారా ఇచ్చిన 18 నోటిఫికేషన్ల పోస్టుల భర్తీ ప్రక్రియ వివిధ దశల్లో ఉన్నాయని, వీటిని త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, లేదంటే తాము ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎం.అశోక్, సురేష్, పి.పోతురాజు, శివమణి, నరేష్, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో సౌకర్యాల కొరత

వినియోగదారుల అవస్థలు

ప్రజాశక్తి - కుకునూరు

మండలంలో ఉన్న పెట్రోల్ బంకులో కనీస మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శుభ్రమైన తాగునీరు, మరుగుదొడ్లు, ఉచిత ఎయిర్ పంపింగ్, ప్రథమ చికిత్స కిట్, ఫిర్యాదుల పెట్టె, ధరల పట్టిక, ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు, ఇంధన నాణ్యత పరీక్ష సౌకర్యం వంటి తప్పనిసరి సేవలు అందుబాటులో లేవని వినియోగదారులు చెబుతున్నారు. మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో పాటు శుభ్రత లోపం వల్ల మహిళలు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇంధన నాణ్యత పరీక్షకు అవసరమైన పరికరాలు, సీల్డ్ బాక్సుల్లో ఇంధన నిల్వ లేకపోవడం వంటి పరిస్థితులు నెలకొన్నాయి. అంతేకాకుండా సిబ్బంది అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని, అధికారుల పర్యవేక్షణ కూడా లేదని వినియోగదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పెట్రోల్‌బంకులో నియమ నిబంధనలు అమలయ్యేలా చూడాలని, అన్ని సౌకర్యాలు కల్పించి వినియోగదారులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై తహశీల్దార్ కె.రమేష్‌బాబును వివరణ కోరగా సివిల్ సప్లై అధికారుల పరిధిలో ఉంటుందని తెలిపారు.

జన సురక్ష పథకాలతో సామాన్య ప్రజలకు భద్రత

లీడ్ బ్యాంక్ మేనేజర్ డి.నీలాద్రి

ప్రజాశక్తి - ఏలూరు

జన సురక్ష పథకాల ద్వారా సామాన్య ప్రజలకు భద్రత కల్పించనున్నట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ డి.నీలాద్రి తెలిపారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి వారి సహకారంతో జిల్లావ్యాప్తంగా మూడు నెలల పాటు అర్హులందరికీ పూర్తి నమోదు కార్యక్రమ ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అటల్ పెన్షన్ యోజన ద్వారా 60 ఏళ్ల తర్వాత నెలకు రూ.వెయ్యి నుంచి రూ.ఐదు వేల వరకు కనీస పెన్షన్ లభిస్తుందన్నారు. చందాదారుడు మరణించినప్పుడు జీవిత భాగస్వామికి అదే పెన్షన్ లభిస్తుందన్నారు. చందాదారుడి, అతని జీవిత భాగస్వామి మరణించిన తరువాత, నామినీ 60 సంవత్సరాల వయస్సు వరకు సేకరించిన పెన్షన్ సంపదను అందుకుంటారన్నారు. 18 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల భారత పౌరులు అర్హులని ఆయన తెలిపారు. పిఎం సురక్ష బీమా యోజన పథకంలో చేరినట్లయితే మరణం లేదా శాశ్వత పూర్తి వైకల్యం సంభవించినప్పుడు రూ.రెండు లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. సంవత్సరానికి రూ.20 ప్రీమియం మాత్రమేనని, 18 నుంచి 70 ఏళ్ల వయస్సువారు అర్హులన్నారు. పిఎం జీవన్ జ్యోతి బీమా యోజన కింద రూ.రెండు లక్షల జీవిత బీమా కవర్ మాత్రమేనని, వార్షిక ప్రీమియం సంవత్సరానికి కేవలం రూ.436 మాత్రమేనని తెలిపారు. 18 నుంచి 50 సంవత్సరాల వయస్సువారు అర్హులన్నారు. పిఎంజెడివై ఐదు ప్రయోజనాలు ఆయన వివరించారు. ఇది సాధారణ పొదుపు బ్యాంకు డిపాజిట్ ఖాతా అని, రూ.రెండు లక్షల అంతర్నిర్మిత ప్రమాద బీమా కవర్‌తో ఉచిత రూపే డెబిట్ కార్డు, రూ.పది వేల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యాన్ని పొందవచ్చన్నారు. అర్హత ఉన్న షరతులకు లోబడి ఉంటుందన్నారు. బ్యాంకు మిత్ర ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను సులభంగా పొందే అవకాశం ఉందని తెలిపారు.

కృష్ణ మాస్టర్‌కు గౌరవ డాక్టరేట్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పెదవేగి మండలం రామచంద్రపురం మోడల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గుగ్గులోతు కృష్ణ మాస్టర్‌కు ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ, ఆసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ స్సూరి అకాడమీ సంయుక్తంగా గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. శనివారం సాయంత్రం తెలంగాణ రాష్ట్రం హైదరాబాదులోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డాక్టర్ నందమూరి తారకరామారావు కళామందిరంలో జరిగిన డాక్టరేట్ల ప్రదానోత్సవ కార్యక్రమంలో గుగ్గులోతు కృష్ణకు గౌరవ డాక్టరేట్ అవార్డును అందించారు. కృష్ణమాస్టారు విద్యారంగంలోనూ, సోషల్ సర్వీస్‌లోనూ చేస్తున్న సేవలను గుర్తించి ఆయనకు సోషల్ సర్వీసెస్ విభాగంలో గౌరవ డాక్టర్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత కృష్ణ మాట్లాడుతూ గౌరవ డాక్టరేట్ అందుకోవటం చాలా ఆనందంగా ఉందని, దీనివల్ల తనకు సమాజం పట్ల మరింత బాధ్యతలు పెరిగాయని చెప్పారు. ఆయనను ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.మోహన్‌రావు, ఇ.రామ్మోహన్‌రావు, మండల విద్యాశాఖాధికారుల సంఘం-2 రాష్ట్ర అధ్యక్షులు తాళ్లూరి వెంకట రామకృష్ణ, తదితరులు అభినందించారు.

సేవియాకు సత్కారం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ఉప విద్యాశాఖాధికారి సేవియా ఉద్యోగ విరమణ కార్యక్రమం ఆదివారం నూజివీడులో నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు నియోజకవర్గంలోని వ్యాయామ ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజు మాట్లాడుతూ సేవియా మంచి పరిపాలనాదక్షుడు, నిరాడంబరంగా ఉండేవారని కొనియాడారు. వ్యాయామ ఉపాధ్యాయులకు ఎనలేని సేవ చేశారని తెలిపారు. మండల పరిధిలోని ఆటల పోటీల్లోను, నియోజకవర్గ ఆటల పోటీల్లోను తమకు ఎన్నో సలహాలు, సూచనలు ఇచ్చి ప్రోత్సహించారన్నారు. ఆటలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. ఉప విద్యాశాఖాధికారి సూచనలతో సబ్ జోన్లను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ కూడా విజయవంతంగా నిర్వహించడానికి కృషి చేశారని నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రవీంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, రవీంద్ర, సుగుణరావు, రాజేంద్రప్రసాద్, సతీష్, ప్రభాకర్, రాణి, బాల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

'మానవత' నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జంగారెడ్డిగూడెం అధ్యక్షులు అయినాల రమణమూర్తి ఆధ్వర్యంలో గురవాయిగూడెం మానవత కమ్యూనిటీ హాల్‌లో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరాటం రాంబాబు, జెట్టి గురునాధరావు, పోల్నాటి బాబ్జి, గురువాయిగూడెం సర్పంచి గుబ్బల సత్యవేణి, పెనుమర్తి రామ్‌కుమార్, పరిమి సత్తిపండు, కిషోర్, చావా రమేష్, కెవిఎన్.ధనకుమార్, సాయిల సత్యనారాయణ, పగడం సౌభాగ్యవతి, వసుధ ఫౌండేషన్ వారు హాజరయ్యారు. మానవత జిల్లా అధ్యక్షులు దేవినేని భాస్కర్ నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షులుగా అల్లూరి రామకృష్ణ, కార్యదర్శిగా మధుకుమార్, ట్రెజరర్‌గా ఇమ్మంది మాధవరావు, ఉపాధ్యక్షులుగా గంధం గోపాలకృష్ణ, జాయింట్ సెక్రటరీగా బేతా రమేష్, ఎమర్జెన్సీ కంపెనీ సభ్యులుగా మాతంశెట్టి నాగేశ్వరరావు, దల్లి అప్పలరెడ్డి, తన్నీరు రామకృష్ణ, దారా సురేష్ గుప్తాలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ మెంబర్ మహంకాళి రంగ ప్రసాద్, సమన్వయ కర్త, నూతన జిల్లా అధ్యక్షులు కండెపు సూర్యనారాయణ, జిల్లా కన్వీనర్ రత్నాకర్, సుధ, ప్రముఖ రాజకీయ నాయకులు, పురప్రముఖులు, పుర ప్రజలు, మానవత మూర్తులు, మానవత సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మందకొడిగా వంతెన నిర్మాణ పనులు

ప్రజాశక్తి - ఉంగుటూరు



రావులపర్రు ప్రకాశరావుపాలెం ఆర్‌అండ్‌బి రహదారి మార్గంలో రావులపర్రు - ఉంగుటూరు మధ్యలో పత్తేపురం వంతెన కాలువపై నిర్మిస్తున్న వంతెన పనులు మందకొడిగా జరుగుతున్నాయి. ఇక్కడ వంతెన 2018లో కూలిపోయింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఈ వంతెనతో పాటు కాగుపాడు వెళ్లే కల్వర్టు నిర్మాణాలకు కలిపి రూ.80 లక్షల నిధులు విడుదల చేసింది. గుత్తేదారుడు పనులు ప్రారంభించి నెల దాటింది. కాంక్రీట్ బాటమ్ పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం పిల్లర్ల నిర్మాణ పనులు చేస్తున్నామని ఆర్‌అండ్‌బి ఎఇ భాస్కర్‌రావు వెల్లడించారు.

నేరాలు - ఘోరాలు

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ముదినేపల్లి


మండలంలోని బొమ్మినంపాడులో కోడిపందేల స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఎనిమిది మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి నాలుగు కోడిపుంజులు, కోడికత్తులు, రూ.4,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వీరభద్రరావు తెలిపారు.

తవ్వేస్తున్నారు..!

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు
ధ్వంసమవుతున్న చెరువు గట్లు
అనుమతులేని ఇటుక బట్టీలకు అధిక ధరకు మట్టి తరలింపు
ఇంతా జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

ఎర్రకాలువ జలాశయం ప్రాజెక్టు మట్టి అక్రమ తరలింపు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



జంగారెడ్డిగూడెంలో...

మండలంలోని వేగవరం, తాడువాయి, చక్రదేవరపల్లి పంచాయతీలో ఉన్న ఎర్రకాలువ జలాశయం ప్రాజెక్టు మట్టిని అక్రమంగా తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, కూటమి నేతల సహకారంతో ఈ మట్టి మాఫియా చెలరేగుతుందని చెబుతున్నారు. అక్రమంగా తవ్విన మట్టిని లారీలు, ట్రాక్టర్ల ద్వారా కొంతమంది దళారులు లే అవుట్లకు, ఇటుక బట్టీలకు తరలిస్తున్నట్లు ప్రజలు చెబుతున్నారు. అశ్వారావుపేట-జంగారెడ్డిగూడెం హైవేపై ఉన్న వేగవరం పంచాయతీ జల్లేరు బ్రిడ్జి వద్ద ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, దీంతో బ్రిడ్జి కూలిపోయే ప్రమాదం ఉందని, అయినా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ మట్టి మాఫియాను ఆగడాలను అరికట్టాలని, మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలని నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.

మట్టి ట్రాక్టర్ల వేగంతో పలు ప్రమాదాలు

పెనుమంట్ర : మండల పరిధిలోని పలు గ్రామాల్లో మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుంది. అయినా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. మట్టి రవాణా చేసే ట్రాక్టర్ వేగానికి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మట్టి ట్రాక్టర్ల వల్ల పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. కొందరు గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయని చెబుతున్నారు. కొన్ని ట్రాక్టర్లను లైసెన్స్ లేని వ్యక్తులు నడుపుతున్నారని, ట్రాక్టర్ ట్రక్కులకు నెంబర్ బోర్డు కూడా ఉండడంలేదని చెబుతున్నారు. వెలగలేరు, ఆలమూరు, జుత్తిగ, మాముడూరు, పాలమూరు, పెనుమంట్రలలో మట్టి తోలకాలు జోరుగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పెనుమంట్రలో...

అధికారుల కనుసన్నల్లోనే తవ్వకాలు

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం ప్రాంతంలో చెరువుల్లో చట్టవిరుద్ధ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో అధికారిక అనుమతులు లేకుండానే మట్టి తవ్వుతున్నారని స్థానిక రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు అధికారులు ప్రజాప్రతినిధుల ఒత్తిడికి లొంగి ఈ అనధికార తవ్వకాలకు మద్దతు ఇస్తున్నారని విమర్శిస్తున్నారు. జెసిబిల సాయంతో మట్టిని తవ్వేసి టిప్పర్లతో జోరుగా రవాణా చేస్తున్నారని, సమీపంలోని పంట పొలాలు దుమ్ము, ధూళితో నాశనమవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారులు కూడా దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. తవ్విన మట్టిని కమర్షియల్ ప్రయోజనాల కోసం లేఅవుట్ నిర్మాణాలు, ఇటుక బట్టీలకు విక్రయిస్తున్నట్లు ప్రజలు చెబుతున్నారు. చెరువుల్లో నీరు తవ్వకాలకు అడ్డంకిగా మారడంతో పంట కాలువల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారన్నారు.



కొయ్యలగూడెంలో..

తవ్వకాల వల్ల చెరువుల్లో ఏర్పడిన గోతుల్లో పశువులు గాయపడుతున్నాయని, నీటిని వదలడం వల్ల చేపల పెంపకందారులు, మత్స్యకారులు ఆర్థిక నష్టాలు చవిచూస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ కార్యాలయం పిడబ్ల్యూ ఎఇ భాస్కర్‌ను వివరణ కోరగా అనుమతులు లేని తవ్వకాలపై మైనింగ్ శాఖకు, పోలీసులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. తమ కార్యాలయం నుంచి ఎలాంటి అనుమతులూ ఇవ్వలేదని తెలిపారు. రైతులు, ప్రజలు ఎప్పుడైనా నేరుగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

దిప్పకాయలపాడు రాజు చెరువులో మట్టి మాఫియా

దిప్పకాయలపాడులోని రాజు చెరువు పరిసరాల్లో మట్టి మాఫియా చెలరేగిపోతోంది. పంట పొలాల కోసం మట్టి తవ్వకాలకు అనుమతులు తీసుకుంటున్నప్పటికీ కమర్షియల్ ప్రయోజనాల కోసం విచ్చలవిడిగా మట్టిని తరలిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మట్టి తవ్వకాలతో చెరువు గట్లు ధ్వంసమవుతున్నాయని, పంట పొలాలకు వెళ్లే రహదారులు ఛిద్రమవుతున్నాయని స్థానిక రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకొని కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలైంది. జూన్ 30, జులై ఒకటో తేదీల్లో నూజివీడు, ఇడుపులపాయ క్యాంపస్‌లకు ఎంపికైన విద్యార్థులకు ఆయా క్యాంపస్‌లోనే కౌన్సెలింగ్ ఉంటుంది. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు జులై 2, 3 తేదీల్లో, ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు జులై 4, 5 తేదీల్లో నూజివీడు క్యాంపస్‌లో కౌన్సెలింగ్ ఉంటుంది. అందులో భాగంగా ఉదయం ఎనిమిది గంటలకు శాక్ ఆడిటోరియంలో 30న జరగబోయే మొదటి రోజు అడ్మిషన్ల నిమిత్తం 505 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపించారు. అడ్మిషన్లు పొందబోయే విద్యార్థులకు సౌకర్యంగా ఉండే నిమిత్తం ఎకడమిక్ సర్టిఫికెట్ల పరిశీలన కోసం ఆరు కౌంటర్లు ఏర్పాటు చేశారు. డేటా ఎంట్రీ కోసం ఎనిమిది కౌంటర్లు, కుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన కోసం నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఫీజు చెల్లించే నిమిత్తం రెండు కౌంటర్లు, ఐడి కార్డులు జారీ చేయడానికి నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేశారు. అడ్మిషన్లు పొందే సమయంలో విద్యార్థులకు, అలాగే వారితో వచ్చిన వారికి ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రవేశాల కన్వీనర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ కోరారు.

'సుపరిపాలనలో తొలి అడుగు'ను జయప్రదం చేయాలి

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సిఎం చంద్రబాబు పిలుపు మేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లి విజయవంతం చేయాలని టిడిపి శ్రేణులకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం, పార్టీ సంస్థాగత నిర్మాణంపై చర్చించేందుకు మంగళగిరిలోని జాతీయ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన టిడిపి విస్తృత స్థాయి సమావేశంలో ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి, మంత్రులు, సహచర ఎంపీలతో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఎంపీ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రతి ఒక్క టిడిపి కుటుంబ సభ్యుడు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఎంపీ పేర్కొన్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని తెలిపారు. ఇంటింటి ప్రచారం సందర్భంగా ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని మై టిడిపి యాప్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. దీని వల్ల ప్రభుత్వం, ప్రజా ప్రతినిధుల పనితీరు పార్టీకి తెలుస్తుందని తెలిపారు. నెల రోజుల పాటు విధిగా ఇంటింటి ప్రచారం నిర్వహించి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడంలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్న సమారాధన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కల్పవృక్షం వృద్ధాశ్రమంలో ఆదివారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. వైసిపి పోలవరం నియోజకవర్గ నేత, పారిశ్రామికవేత్త కీర్తిశేషులు పోతన శేషగిరిరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు గణేష్ రాయుడు సౌజన్యంతో ఈ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధులకు ఒక రోజుకు సరిపడా భోజన వసతి పౌష్టికాహారాన్ని సమకూర్చారు. కొయ్యలగూడెంలోని వృద్ధాశ్రమంతో పాటు కన్నాపురం, పోలవరం, గొల్లగూడెంలోని వృద్ధాశ్రమాలకు శేషగిరిరావు అన్ని విధాల సహాయ సహకారాలు అందించారని ఆశ్రమ నిర్వాహకులు మాజేటి అప్పలరాజు చెప్పారు. ఆశ్రమం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాజా గణేష్ రాయుడు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజేటి సత్యనారాయణ, దారం సత్తిరాజు, యాతం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణం పూర్తి

ప్రజాశక్తి - ఉంగుటూరు

రావులపర్రు - కోనాల ఆర్‌అండ్‌బి రహదారిలో కాగుపాడు వెళ్లే దారిలో కల్వర్టు పనులు ఎట్టకేలకు ఆర్‌అండ్‌బి అధికారులు పూర్తి చేశారు. ఈ కల్వరు దారి మీదగానే రావులపర్రు నుంచి కాగుపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాలకు వెళ్లే సుమారు 60 మంది విద్యార్థులు రోజుకు అటు ఇటు 11.5 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. ఈ కల్వర్టు పూర్తయితే రాను పోను ఏడు కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. కల్వర్టు పూర్తి చేసి మట్టితో చదును చేశారు. ప్రస్తుతానికి ద్విచక్రవాహనాలు వెళ్లిపోయేందుకు వీలుగా ఉంది. బొమ్మిడి, కాగుపాడు, రావులపర్రు గ్రామాలకు చెందిన పొలాల్లో వరద, మురుగు నీరంతా ఇప్పుడు నిర్మించిన కల్వర్టు ద్వారా తోకలపల్లి ప్రధాన మురుగు కాలువలోకి వెళ్లాల్సి ఉంది.

రోడ్లకు మరమ్మతు చేయాలని నిరసన

ప్రజాశక్తి - కలిదిండి



నిరసన తెలుపుతున్న రైతులు, విద్యార్థులు, సిపిఎం నేతలు

గుంతల రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ మండలంలోని మూలలంక అర్‌అండ్‌బి రోడ్డుపై సిపిఎం ఆధ్వర్యంలో రైతులు, విద్యార్థులు ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం కలిదిండి ప్రాంతీయ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు మాట్లాడుతూ మండలంలోని మూలలంక నుంచి పెదలంక వరకు, తాడినాడ నుంచి కలిదిండి వరకు అర్ అండ్ బి రోడ్లు గుంతలమయంగా మారి అత్యంత ప్రమాదభరితంగా ఉన్నాయన్నారు. గెలిచిన వెంటనే గుంతలు లేని రోడ్లు నిర్మిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఏడాది గడిచినా రోడ్లు బాగుచేయకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రజలు, విద్యార్థులు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని వాహనాల్లో ప్రయాణించే దుస్థితి నెలకొందని ఆరోపించారు. వెంటనే గుంతలు లేని రోడ్లు నిర్మించేలా చర్యలు చేపట్టాలన్నారు. రైతులు, విద్యార్థులతో కలిసి గుంతల రోడ్డుపై గడ్డి నాటుతూ రోడ్ల దుస్థితిని వివరించారు. సిపిఎం నాయకులు డివి.సత్యనారాయణ, వి.భాస్కరరావు, ఎస్‌ఎన్‌వి.సత్యనారాయణ, ఎస్.మహాలక్ష్మి, బి.రామనాగేంద్రం, జి.అనిల్‌కుమార్, రైతులు కెవి.సుబ్బారావు, జి.అప్పారావు, వెంకన్న, పద్మరాజు, శ్రీనివాసరావు, సీతయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు అన్నివేళలా అండగా ఉంటాం

కేశినేని శ్రీదేవి మెమోరియల్ ఛారిటబుల్ ఫౌండేషన్ ఛైర్మన్ రమేష్

వంద కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాల పంపిణీ



బియ్యం, నిత్యావసరాలు అందిస్తున్న రమేష్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పేద కుటుంబాలకు అన్నివేళలా అండగా ఉంటామని కేశినేని శ్రీదేవి మెమోరియల్ ఛారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ కేశినేని రమేష్ స్పష్టం చేశారు. పట్టణంలోని వంద పేద కుటుంబాలకు ఆదివారం 26 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరో వస్తారు ఏదో చేస్తారని ఎదురుచూసి పేదలు ఆకలితో అలమటించకూడదన్నారు. తన సంపదలో కొంత భాగం పేదల అభ్యున్నతికి వినియోగిస్తానని చెప్పారు. తన మాతృమూర్తి శ్రీదేవికి ఇచ్చిన మాట ప్రకారం పేదల ఆర్థిక అభివృద్ధి కోసం అనునిత్యం కృషి చేస్తున్నట్లు చెప్పారు. అందుకోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని శివారు గ్రామాల్లో ఇప్పటికీ పేదరికంలో మగ్గుతున్న వందలాది కుటుంబాలను దత్తత తీసుకునే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. అందులో భాగంగానే మొట్టమొదటిసారి నూజివీడు పట్టణంలోని పేదలకు బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేసినట్లు వివరించారు. ఫౌండేషన్ నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో పేదలకు, వృద్ధులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు వారు చదువుకునే విద్యాసంస్థల్లో ఫీజులు చెల్లించడం, పుస్తకాలు, దుస్తులు, చదువుకు సంబంధించిన ఇతర అవసరాలను, సౌకర్యాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇల్లు కట్టుకోలేని నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నిజం చేసే దిశగా ఫౌండేషన్ నూతన ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. అందులో భాగంగా ఫౌండేషన్ గ్లోబల్ సర్వే నిర్వహించి నిరుపేద కుటుంబాలను గుర్తించనున్నట్లు తెలిపారు. సర్వేలో అర్హత కలిగిన నిరుపేద కుటుంబాలకు ఇల్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. సమాజాభివృద్ధిలో మూల స్తంభమైన పాత్రికేయులు నేడు నిరాదరణకు గురై, జీవించలేని దుస్థితిలో ఉన్నారని తన దృష్టికి వచ్చినట్లు చెప్పారు. అలాంటివారికి ఫౌండేషన్ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. త్వరలోనే పాత్రికేయుల జీవనస్థితి మెరుగుపరిచే దిశగా ప్రణాళిక బద్ధంగా ముందడుగు వేయనున్నట్లు చెప్పారు. ఫౌండేషన్ తరపున తాము చెప్పిందే చేస్తామని, చేసేదే చెబుతామని అన్నారు. ఇక్కడ ఎలాంటి రాజకీయాలకు తావు లేదన్నారు. సాటి మనిషిగా, జన్మనిచ్చిన తల్లికి ఇచ్చిన వాగ్దానం మేరకు తాను సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కేశినేని రమేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు చింతకుంట మరియన్న, అన్వర్ షేక్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

అల్లు శ్రీనుకు ఘన సత్కారం

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని ఉప్పాకపాడు మోడల్ ప్రైమరీ ఉపాధ్యాయులు అల్లు శ్రీను ఇటీవల బదిలీపై బాదంపూడి మోడల్ స్కూల్‌కు వెళ్లారు. అల్లు శ్రీనుకు ఉప్పాకపాడు ప్రధానోపాధ్యాయులు నక్కా సుధాకర్, ఎస్ఎంసి ఛైర్మన్ కన్నాటి వెంకటేష్, ఉపాధ్యాయులు పి.శ్రీదేవి, వడితే పాపారావు, పైలా ఏడుకొండలు పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానం చేశారు. గ్రామ సర్పంచి నేదూరి మోహన్‌రావు, వైస్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలీ, కూటమి నాయకులు కాకిలేటి వెంకటేశ్వరరావు, మంచాల పెద్ద సత్యనారాయణ, దాసరి శ్రీనివాసరావు, ఎస్ఎంసి వైస్ ఛైర్మన్ నాగమణి సన్మానించారు. గ్రామ సర్పంచి మోహన్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు అల్లు శ్రీను ఉప్పాకపాడు కీర్తిని రాష్ట్ర స్థాయికి తీసుకువెళారన్నారు. కాకిలేటి సత్యనారాయణ మాట్లాడుతూ పిల్లలను రాష్ట్ర స్థాయి పోటీలకు తీసుకెళ్లి విద్యార్థుల అభివృద్ధికి కృషి చేశారు. తల్లిదండ్రులు రేవతి, శ్రావణి, నాగమణి, విద్యార్థి వంబరిల్లి సమీరా మాట్లాడుతూ అల్లు శ్రీను తల్లిదండ్రులు కంటే ఎక్కువగా పిల్లలను శ్రద్ధగా చూసి వారి అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. అల్లు శ్రీను మళ్లీ అవకాశం ఉంటే ఉప్పాకపాడు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, బేబి, ప్రభావతి, ఉన్నీషా, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి

మున్సిపల్ వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు రావాల్సిన ఇంక్రిమెంట్లు, మెడికల్ బిల్లులు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లులు వెంటనే చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) డిమాండ్ చేసింది. స్థానిక స్ఫూర్తి భవనంలో మున్సిపల్ ఉద్యోగుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న 140 మంది పర్మినెంట్ ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు, మెడికల్ బిల్లులు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర బిల్లులు మూడేళ్ల నుంచి బకాయి ఉన్నాయన్నారు. వీరిలో చాలామందికి మూడేళ్ల నుంచి ఇంక్రిమెంట్లు, స్పెషల్ ఇంక్రిమెంట్లు, తొమ్మిది నెలల నుంచి మెడికల్ బిల్లులు, గత రెండున్నరేళ్ల నుంచి చనిపోయిన, రిటైర్‌మెంట్ అయినవారికి రావాల్సిన లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లుల బకాయిలు చెల్లించడం లేదన్నారు. ఉద్యోగులు వారికి రావాల్సిన బకాయి బిల్లుల కోసం కార్యాలయం చుట్టూ పదేపదే తిరుగుతున్నా సాంకేతిక కారణాలు చెబుతూ చెల్లించడం లేదన్నారు. పారిశుధ్య ఉద్యోగులకు రావాల్సిన బకాయి బిల్లులు వెంటనే క్లియర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర ఉపాధ్యక్షులు బంగారు దుర్గాప్రసాద్, సభ్యులు హేడారి వంశీ, ఎ.ప్రసాద్, పొద్దుటూరి సురేష్, బంగారులక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన డిఎస్‌సి పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మెగా డిఎస్‌సి-2025 పరీక్షలు ఆదివారం ఏలూరులో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో వంద మందికి 83 మంది హాజరు కాగా 17 మంది గైర్హాజరయ్యారు. సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మొత్తం 115 మందికి 95 మంది హాజరు కాగా 20 మంది గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష జరగలేదు. మొత్తం రెండు కేంద్రాల్లో 215 మందికి 178 మంది హాజరు కాగా 37 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ఐదు గంటల వరకు జరిగిన పరీక్షలకు సిద్ధార్థ క్వెస్ట్‌లో 101 మందికి 94 మంది హాజరు కాగా ఏడుగురు గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష జరగలేదు. సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షలకు మొత్తం 201 మందికి 183 మంది హాజరు కాగా 18 మంది గైర్హాజరయ్యారు. మొత్తం రెండు కేంద్రాల్లో 302 మందికి 277 మంది హాజరు కాగా 25 మంది గైర్హాజరయ్యారు.

సబ్‌జైలు సందర్శన

ప్రజాశక్తి - చింతలపూడి

ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ ఎస్.శ్రీదేవి చింతలపూడి సబ్‌జైలును ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా నిందితుల కేసుల వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, తాగునీటి సౌకర్యాలు, అనారోగ్యంగా ఉన్న వారికి అందించే వైద్య సేవల గురించి ఆరా తీశారు. జైలు ప్రాంగణంలో ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తిని బార్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు, ప్యానల్ అడ్వకేట్ టోకూరి వెంకటేష్, పిఎల్‌వి టివిఎస్.రాజు, జైలు సూపరింటెండెంట్ కృపానందం, చింతలపూడి సిఐ టి.కాంత్‌కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితునికి సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు మొత్తం కాలిపోయి రోడ్డున పడిన కుటుంబానికి అండగా నేనున్నానంటూ అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి ముందుకు వచ్చి ఆదివారం సాయం అందించారు. మండలంలోని వణుదుర్రు గ్రామానికి చెందిన వృద్ధుడు అల్ల వీరుడు ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు మొత్తం పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఇంట్లోని వస్తువు లన్నీ కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న అంబుల వైష్ణవి తక్షణ సహాయం కింద తండ్రి డాక్టర్ మనోజ్ చేతుల మీదుగా రూ.ఐదు వేల నగదు, నిత్యావసర సరుకుల అందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సంస్కృత ఉన్నత పాఠశాలలో 1991 - 1992 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు అపూర్వ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆనాటి విద్యార్థులందరూ కుటుంబ సమేతంగా కార్యక్రమానికి హాజరై ఆనాటి తీపి, మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరితో మరొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఎంతో ఆనందంగా గడిపారు. సైన్స్ మాస్టర్ వేణునాథ్, డ్రిల్ మాస్టర్ సుబ్బరాజు, తెలుగు మాస్టార్ వెలది జగన్నాధరావు, గంపా రామ్మోహనరావు, ప్రస్తుత హెడ్‌మాస్టర్‌ను ఘనంగా సన్మానించారు. పాఠశాలకు తమవంతు సహకారం అందిస్తామన్నారు.

150 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని గవరవరంలో ఆదివారం క్యాన్సర్ స్క్రీనింగ్ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఏలూరు వైభవ్ ఆదర్శ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మణిపాల్ సూపర్ స్పెషాలిటీ వైద్య బృందం 150 మందికి పైగా మహిళలకు ఆధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించారు. మహిళల్లో ఎదురవుతున్న కేన్సర్ సమస్యల గురించి అవగాహన కల్పిస్తూ వైద్య పరీక్షలు నిర్వహించారు. జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఎస్ఆర్ఆర్ సుభద్ర దేవి మహిళలకు సేవలందించి బ్రెస్ట్, గర్భాశయ కేన్సర్ గురించి వివరించారు. మాజీ సర్పంచి ఎస్ఆర్ఆర్ నరసింహరాజు సౌజన్యంతో వైద్య శిబిరం నిర్వహించారు.

కల్వర్టు పరిశీలన

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం గ్రామం కమ్మరగూడెం పేట బాపూజీ కాలనీ నుంచి ప్రధాన రహదారికి వెళ్లడానికి నిర్మిస్తున్న కల్వర్టును ఎంపిపి సుంకర వెంకటరెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కల్వర్టు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి పటిష్టంగా నిర్మించారని కాంట్రాక్టర్‌ను ప్రశంసించారు. మండల పరిషత్ నిధులు, ఉపాధి హామీ చట్టం నిధులతో డ్రెయిన్లు, సీసీ రోడ్లు నిర్మించడానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఆయనతో పాటు ఎంపిటిసి సభ్యురాలు కాశే ధనలక్ష్మి(మేరీ), సుంకర రాంకీ, కొండే చంటి, వార వీర్రాజు, వార శేఖర్, వారా వెంకట్రావు, మట్టా భద్రం ఉన్నారు.

టిడిపి గ్రామ అధ్యక్షులుగా నరసింహారావు

ప్రజాశక్తి - ముసునూరు

టిడిపి ముసునూరు గ్రామ అధ్యక్షులుగా గార్లపాటి నరసింహారావు ఎన్నికైనట్లు ఆ పార్టీ మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు తెలిపారు. గతంలో పార్టీ గ్రామ అధ్యక్షుని పదవి నియమించే సమయంలో నరసింహారావు పోటీ పడ్డారు. ప్రస్తుతం ఆయనకు ఆ పదవి రావడంతో ఆయనను టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందించారు.